




జూబ్లీనగర్ నుంచి గంగుల కమలాకర్ ర్యాలీకి తరలి వస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



చామనపల్లి నుంచి ర్యాలీకి తరలివస్తున్న నాయకులు

# గంగుల ప్రచార ర్యాలీకి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

*కరీంనగర్‌లో మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ నిర్వహించిన ప్రచార ర్యాలీకి కరీంనగర్ రూరల్ మండల పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలివచ్చారు. మంత్రి గంగులకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గంగుల కమలాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.*

-కరీంనగర్ రూరల్, నవంబర్ 28

## హైందవధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కొత్తపల్లి, నవంబర్ 28: హైందవధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి పిలుపునిచ్చారు. కొత్తపల్లిలోని శ్రీసచ్చిదానం ఆశ్రమం (రామాలయం) ప్రాంగణంలో అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమద్భగవత సప్తాహ మహోత్సవంలో మంగళవారం ఆయన పాల్గొని భక్తులకు హితబోధ చేశారు. భారతదేశ సంస్కృతీసంప్రదాయాలు, ధర్మాన్ని కాపాడుకోవాలని తెలిపారు. భగవంతుడిని ఆరాధించడం ద్వారా ఆధ్యాత్మిక చింతన ఏర్పడి సన్మార్గంలో పయనించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేద భవనం ప్రిన్సిపాల్ వరప్రసాదాచార్యులు, ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితుడు నమిలకొండ రమణాచార్యులు, వికాస తరంగిణి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎస్సారార్ కళాశాలకు ప్రత్యేక సెలవులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 29వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు ప్రత్యేక సెలవులు ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్, స్ట్రాంగ్ రూముల భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

### *విద్యాసంస్థలకు రెండు రోజులు సెలవులు*

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు ఈనెల 29, 30న ప్రత్యేక సెలవులు మంజూరు చేస్తున్నట్లు ఆయా పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఎన్నికల నేపథ్యంలో పలు పాఠశాలలను ఎన్నికల కేంద్రాలుగా కేటాయించగా, మరికొన్ని పాఠశాలలకు ఇబ్బందులు తలెత్తవద్దని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## పోలీసుల తనిఖీలు

రాంనగర్, నవంబర్ 28: డబ్బు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లాలో వాహన తనిఖీలు చేపడుతున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తెలిపారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనుండగా చివరి 48 గంటల్లో అక్రమంగా డబ్బు, మద్యం, ప్రజలను ప్రలోభపెట్టడానికి ఇతర వస్తువుల అక్రమ తరలింపునకు, పెద్ద ఎత్తున తరలించడానికి అవకాశం ఉన్నందున వాటిని నిరోధించడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. వాటికి జిల్లాలోని పలుచోట్ల కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా పోలీసులు ఉమ్మడి బృందంగా ఏర్పడి పక్కా సమాచారంతో తనిఖీలు, మెరుపు దాడులు జరుపుతున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## మద్యం దుకాణాలు మూసివేత

రాంనగర్, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ అర్బన్ స్టేషన్ పరిధిలోని 21 రిటైల్ షాపులు, 22 బార్లు, ఒక క్లబ్, ఒక మిలిటరీ క్యాంటీన్, మూడు కల్లు దుకాణాలను మూసివేసి సీల్ చేశారు. ఈనెల 30న సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత తెరుచుకుంటాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు మద్యం సరఫరా జరుగకుండా నిఘా, పెట్రోలింగ్ టీంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గాని, అమ్ముతున్నట్లు తెలిస్తే సెల్ నంబర్ 87126 58808కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు



కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం ఇస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

కొత్తపల్లి, నవంబర్ 28: ఎన్నికల విధుల్లో ఉద్యోగులకు ఎదురవుతున్న ఇబ్బందులు, పోస్టల్ బ్యాలెట్, తదితర అంశాలపై టీఎన్జీవోస్ నాయకులు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో కేంద్రం సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులకు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ సాంక్షన్ చేయాలన్నారు. విధులు నిర్వహిస్తున్న అధికారులకు పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పించేలా చూడాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక వసతులు కల్పించాలని కోరగా అక్కడికక్కడే స్పందించిన కలెక్టర్ స్పెషల్ క్యాజువల్ లీవ్‌కు సంబంధించిన ఆర్డర్స్ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోని ఉద్యోగులు వారి నియోజకవర్గంలోనే వేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఇప్పటి వరకు ఫాం 12 ఇవ్వని ఉద్యోగులకు, ఫాం 12 ఇచ్చినా ఆర్వోకు చేరకపోతే తిరిగి ఇస్తే పోస్టల్ బ్యాలెట్‌ను ఇస్తారని టీఎన్జీవోస్ నాయకులకు చెప్పారు. ఇక్కడ టీఎన్జీవో కేంద్ర సంఘం నాయకుడు నాగుల నరసింహాస్వామి, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, రూరల్ అధ్యక్షుడు రాజేశ్ భరద్వాజ్, మహిళా జేఏసీ చైర్‌పర్సన్ శారద, సబిత, సునీత, రాజేశ్వరరావు, కొండయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామస్వామి తదితరులున్నారు.

కమాన్‌చౌరస్తా, నవంబర్ 28: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు డిసెంబర్ ఒకటిన ప్రత్యేక సెలవు మంజూరు చేసేందుకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అనుమతి ఇచ్చినట్లు పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతి రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌ను సంఘం బాధ్యులు కలిసి విన్నవించగా ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే, ఎన్నికల సిబ్బందికి వసతులు కల్పించేందుకూ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఇక్కడ నాయకులు వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలి



పోటీలను ప్రారంభిస్తున్న కడారి అనంతరెడ్డి

కొత్తపల్లి, నవంబర్ 28: కరీంనగర్ జిల్లా జూడో క్రీడకు పెట్టింది పేరు అని, రాష్ట్రస్థాయిలో జరిగే జూడో పోటీల్లో మన క్రీడాకారులు సత్తాచాటి పతకాలు సాధించాలని మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల జూడో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆత్మ రక్షణకు జూడో క్రీడ ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్ర స్థాయి జూడో పోటీలను గతంలో మానేరు విద్యాసంస్థల్లో పలుమార్లు నిర్వహించినట్లు చెప్పారు. జూడో సంఘం రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, జూడో క్రీడకు పెట్టింది పేరు కరీంనగర్ అని, గతంలో ఎన్నో సార్లు జాతీయ, రాష్ట్ర స్థాయి జూడో పోటీలను అట్టహాసంగా నిర్వహించామన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను డిసెంబర్ 5, 6వ తేదీల్లో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్ జోన్ కార్యదర్శి అంతటి శంకరయ్య, పెద్దపల్లి జిల్లా జూడో సంఘం కార్యదర్శి సిలివేరి మహేందర్, భారత జట్టు మాజీ ఖోఖో క్రీడాకారుడు గెల్లు మధూకర్‌యాదవ్, జూడో సంఘం జిల్లా బాధ్యులు ఎల్వీ రమణ, గోలి సుధాకర్, ఎం శ్రీధర్, ప్రాంతీయ క్రీడా పాఠశాల జూడో కోచ్ సాయిరాం యాదవ్, పీడీ, పీఈటీలు క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను నమ్మితే బతుకులు ఆగమే

- ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలను పీక్కుతింటున్నరు
- అన్నివర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయం
- మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వరకు భారీ బైక్ ర్యాలీ

గన్నేరువరం, నవంబర్ 28 : కాంగ్రెస్‌ను నమ్మితే ప్రజల బతుకులు ఆగమవుతాయని, ఆ పార్టీ పాలించే రాష్ట్రాల్లో పీక్కు తింటున్నారని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులతో కలిసి మండలంలోని గుండ్లపల్లి నుంచి మండల కేంద్రం వరకు 17 కిలోమీటర్ల దూరం బైక్ ర్యాలీ తీశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్‌లో దవాఖానలు పెట్టి దోచుకున్న డబ్బులతో వచ్చి డబ్బు సంచులతో నాయకులను కొనాలని చూస్తున్నరని, కానీ మానకొండూరు ప్రజలను కొనలేరని స్పష్టం చేశారు. అధికారం కోసం కాంగ్రెస్ ఏవో మాయమాటలు చెప్తూ అమలుకు సాధ్యం కాని హామీలను ఇస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు మొదలవుతాని, కరెంట్ కావాలో? కాంగ్రెస్ కావాలో? ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ గ్యారెంటీలు ఏమోగానీ ఆర్నెళ్లకు ఒక సీఎం మారుడు పక్కా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ రాకముందు వ్యవసాయం దండుగ అన్నారని, కేసీఆర్ వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి రైతును రాజు చేసిండన్నారు. సమైక్య పాలనలో కూలి పని దొరికేది కాదని, నేడు కూలీలు దొరకడం లేదన్నారు. తాను అభివృద్ధి చేశానని, మరోసారి పట్టం కట్టాలని కోరారు.

## గంగులకు ఆటో కన్సల్టెన్సీ అసోసియేషన్ మద్దతు

తెలంగాణచౌక్, నవంబర్ 28: బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు కరీంనగర్ బైక్ ఆటో కన్సల్టెన్సీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నగరంలోని ప్రెస్ భవనంలో మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు సుప్రీం జావిద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గంగుల గెలుపు కోసం అసోసియేషన్ తరపున కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ నాయకులు హఫీజ్, అహ్మద్, ముబీన్ పాల్గొన్నారు.

## రెజ్లింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 28 : పంజాబ్‌లోని చండీఘడ్ యూనివర్సిటీలో ఈనెల 29 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు జరిగే సౌత్, వెస్ట్ రెజ్లింగ్ యూనివర్సిటీ పోటీలకు కరీంనగర్‌లోని గిరిజన డిగ్రీ కళాశాల విద్యార్థులు నితిన్, గణేశ్ ఎంపికైనట్లు పీడీ ఎండీ సర్వర్ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ లావణ్య, పీడీ, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## ఓట్ల లెక్కింపులో సూక్ష్మపరిశీలకుల పాత్ర కీలకం

కలెక్టరేట్, నవంబర్ 28: ఓట్ల లెక్కింపులో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, ఆమె హాజరై మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల విధులు సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం, ఇతర అధికారులు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

రాంనగర్, నవంబర్ 28: కరీంనగర్ కమిషనర్ కేంద్రంలో గల పరేడ్ గ్రౌండ్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సిబ్బందికి, స్థానిక హోంగార్డులకు ఎన్నికల విధులపై మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి అవగాహన కల్పించారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అడిషనల్ డీసీపీలు రాజు, లక్ష్మీనారాయణ, ఏసీపీ నర ప్రతాప్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్ బాబు, రజినీకాంత్, శ్రీధర్ రెడ్డి, సురేశ్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్‌కు పటిష్ట భద్రత

రాంనగర్, నవంబర్ 28: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. శాంతియుత వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధమైందన్నారు. పోలింగ్ మొదలయ్యే రోజు ముందు నుంచి దాదాపు 3000 మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. క్లిష్టమైన ప్రాంతాల్లో ఎలాంటి భద్రతా పరమైన సమస్యలు తలెత్తినా స్పందించేందుకు ప్రత్యేక యాక్షన్ టీమ్‌లను కూడా నియమించామని తెలిపారు. అన్ని కీలకమైన పోలింగ్ స్థానాలు కేంద్ర పారా మిలిటరీ బలగాల పరిధిలో ఉంటాయని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం సెక్షన్ 144 సీఆర్‌పీసీ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లు కాని బయటి వ్యక్తులెవరూ ప్రచార వ్యవధి ముగిసిన తర్వాత నియోజకవర్గంలో ఉండొద్దని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు, అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.